

# ఋణఋణధ్వని

జీడిగుంట రామచంద్రమూర్తి

"అప్పు!"

రెండే రెండు అక్షరాలతో కూడిన ఈ మాట చాలామందికి అత్యంత ప్రీతిపాత్రమైన మాట!

"హలో! ఓ ఫైవుంటే అప్పిస్తావా.."

"పిన్నిగారూ! ఇంట్లో కాఫీపొడి నిండుకుంది. ఓ రెండు స్పూన్లు అప్పిస్తే — ఆనక బజార్లోంచి తెచ్చాక తీర్చేస్తాను!"...


"చూడు సుబ్బారావ్! ఉద్యోగం దొరకలేదని ఉసూరుమంటూ కూర్చుంటే ప్రయోజనం లేదు...బ్యాంకులో అప్పు తీసుకుని ఏదైనా ఇండస్ట్రీ పెట్టుకోవాలి!"...

"డబ్బు లేదంటే ఎలాగండీ...? అబ్బోసొబ్బో చేసి ఓ అయ్య చేతిలో పెట్టాలి తప్ప-ఎదిగిన పిల్లని ఎంతకాలం గుండెలమీద బరువులా వుంచుకుంటారు?"—

ఇలా 'అప్పు' అనే వ్యవహారం — తప్పనిసరిగా మన దైనందిన కార్యక్రమాల్లో చోటుచేసుకుంటూనే వుంటుంది. 'అప్పుచేయటం' అనేది ఎలాంటివారికైనా సరే తప్పని విషయం! వడ్డీకాసులవాడిగా కీర్తించబడే ఏడుకొండల వెంకన్నంతటివాడే-అలనాడు కుబేరుడి దగ్గర అప్పుచ్చుకుని ఇప్పటికీ దాన్ని తీర్చలేక అల్లాడిపోతూంటే-ఆఫ్టారాల్ మానవమాత్రులం మనమెంత?...మన లెవలెంత?...

కొంతమంది అంటూంటారు-

"అప్పు నిప్పులాంటిది—అప్పు మీది వడ్డీ ఆడపిల్ల వయసులాంటిది"— అని.




ద్రాక్షపళ్ళ కోసం ఎగిరెగిరి-అలిసి పోయి, అది అందకపోయేసరికి-

"ఛీ...ఆ పుల్లటి పళ్ళు ఎవరిక్కా-వాలే?" - అనుకుందట వెనకటికి ఓ నక్క!...

అలాగే- అప్పుకోసం ఎన్నో అవస్థలు పడి-ఆఖరికి అది దొరక్కపోతే- "ఛీ...అప్పు నిప్పులాంటిది!"- అని తృప్తిపడి వుంటారు, సదరు సూక్తిని సృష్టించిన సుబ్బారావులు! నిజంగా అప్పు నిప్పులాంటిదే అయితే-ఈనాడు వ్యాపార రంగంలో 'ఇన్‌స్టాల్‌మెంట్ స్కీములు' - ఇంత విరివిగా చోటుచేసుకునేవా?...

అప్పే తమ ధ్యేయంగా, అప్పే తమ సర్వస్వంగా, అప్పులో పుట్టి, అప్పులోనే పెరిగి — అప్పుతో ఆడుకుంటూ- ఆఖరికి ఆ అప్పు తీర్చకుండానే 'హరీ' మనే అప్పారావులు- ఈ ప్రపంచంలో ఎందరో వున్నారు.

అసలు మీరు గమనించారో లేదో- అప్పులు చేసే అప్పేశ్వరావులకు డెఫినిట్‌గా ఆయుర్దాయం ఎక్కువుంటుంది... ఎలా అంటారా?

సపోజ్ నేను మీ దగ్గర వందో, వెయ్యో అప్పు తీసుకున్నాననుకోండి! దాన్ని తిరిగి మీకు నేను తీర్చేవరకూ— నా ఆరోగ్యాన్ని మీరు కోరుకుంటారు. నా యోగక్షేమాల్ని తరచూ కనుక్కుంటారు!...ఖర్మం చాలక ఏ అనారోగ్యంతోనో నేను ఆస్పత్రిపాలైతే- నేను మీ దగ్గర తీసుకున్న అప్పు స్థాయిని బట్టి- మీరు నాకు సేవలు చేస్తారు...కొండొకచో మంచి డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళి ట్రీట్‌మెంట్ కూడా ఇప్పిస్తారు!

అసలు ఇప్పుడిప్పుడు మన దేశంలో మనిషియొక్క సగటు ఆయుర్దాయం పెరగటానికి మూలకారణం ఇదేనేమో నన్న అనుమానం చాలామందిలో కలుగక పోదు ఆలోచిస్తే!...ఇదే 'రూలు' దేశాలకు కూడా వర్తిస్తుంది! ఉదాహరణకి- మనదేశం ప్రపంచ దేశాలన్నింటి నించీ ఘనంగా అప్పులు తీసుకుందను

కోంది:...ఇక మనం, అంటే మనదేశం విశ్రాంతిగా వుండచ్చు. ఏ దేశమూ, ఎలాంటి పరిస్థితిలోనూ మనదేశంతో యుద్ధానికి తలపడదు!

అసలు లేనివాళ్ళు ఉన్నవాళ్ళ దగ్గర అప్పు తీసుకుని- పప్పుకూడు తినటంలో తప్పులేదని-ఓ కవిగారు అలనాడెప్పుడో ఓ గొప్ప నీతి వాక్యాన్ని శలవిచ్చారు! ఆ మాటకొస్తే, 'అప్పిచ్చువాడు' అందు బాటులో లేని ఊళ్ళో ఉండద్దు సుమా అని ప్రజాకవి వేమన్న, వార్నింగు కూడా ఇచ్చాడు.

పోతే—

అప్పు తీసుకోటంలో వుండే 'థ్రిల్లు' —తీర్చటంలో చచ్చినా వుండదు. వంద రూపాయలు అప్పు తీసుకుని, దానిమీద వెయ్యి రూపాయల దాకా వడ్డీ కట్టేందు కైనా సిద్ధపడిపోతాం కానీ— 'అసలు వంద' - తీర్చాలని ఉబలాటపడం!... అదో సైకాలజీ!

ఇలాంటి సైకాలజీని నరనరాల్లోనూ వంటబట్టించుకున్న ఓ అప్పారావు— అద్భుతమైన ట్రిక్కు ప్లేచేసి-పక్కింటి బామ్మగారి దగ్గర—ఓ రెండు వందలు అప్పు కొట్టేశాడు...దసరా పండుగ లోగా తిరిగి తీర్చేస్తానని ప్రామిస్సయితే చేశాడు.

దసరా వెళ్ళిపోయింది. ఓవైపు దీపా వళి కూడా వచ్చేస్తోంది. ఈలోగా ఎవరో మాటల సందర్భంలో అప్పారావ్‌కి ఇచ్చిన అప్పు గోడకు వేసిన సున్నం ఒక్కటేనని బామ్మగారికి చెప్పారు. దాంతో బామ్మగారికి దిగులు పట్టుకొంది. నాలుగయిదు రోజుల పాటు తెగ ఆలో చించారు 'అప్పారావ్ దగ్గర్నించి అప్పు ఎలా రాబట్టుకోవాలా?' అని.

చివరికి ఆవిడకి ఓ ఉపాయం తోచింది. వెంటనే అప్పారావ్ దగ్గరకు వెళ్ళారు.

"ఏవయ్యా అప్పారావ్ ఇదేవన్నా బావుందా?'— అని అడిగారు.

అమాయకంగా ముఖంపెట్టి అన్నాడు అప్పారావ్—

"ఫస్టుక్లాసుగా వుంది బామ్మగారూ! అయినా ఎందుకలా అడిగారూ?...ఎవ రయినా బాగాలేదన్నారా?"—

బామ్మగారికి ఒళ్లు మండింది-

"నే నడిగే దేమిటీ—నువ్ చెప్పే దేమిటీ?"

"ఏవడిగారూ?...మీరు కట్టుకున్న ఆ 'పట్టుచీర బాగుందా?' అని కాదూ అడిగిందీ?"—

వస్తున్న కోపాన్ని తమలో తామే అణుచుకుని-అసలు విషయం చెప్పారు బామ్మగారు.

"నీతో నాకు వాదనెందుగ్గానీ-నా రెండు వందలూ నా కిస్తావా లేదా?"— అని అడిగేశారు చివరికి.

"ఏ రెండు వందలండీ?"

"నాదగ్గర అప్పుగా తీసుకున్న రెండు వందలు!"

"ఏ అప్పండీ?"

"వామ్మో...! ఏ అప్పా? ఆ మధ్య నా దగ్గర రెండు వందలు తీసుకుని, దసరా పండక్కి తిరిగి తీర్చేస్తానన్లేదూ?" తీవ్రంగా అడిగారు బామ్మగారు.

"మరి దసరా వెళ్ళిపోయింది కదండీ?"

"అంటే?...దసరా వెళ్ళిపోతే-ఇహ నా అప్పు తీర్చవా ఏమిటి?"

అప్పారావ్ దీనంగా ఫేస్ పెట్టాడు. కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తూ బరువుగా బదులు చెప్పాడు-

"ఏం చేయమంటారు బామ్మగారూ! నా దురదృష్టం అలా అఘోరిస్తోంది!... నేను ఎక్కడ, ఎప్పుడు, ఎవరిదగ్గర అప్పు తీసుకున్నా - దాన్ని దసరాకే తీర్చాలి! అలా తీరిస్తేనే నాకు జాతక రీత్యా మంచిదనీ—మళ్ళీ మళ్ళీ అప్పు పుడుతూంటుందనీ ఓ దైవజ్ఞ శిఖామణి గారు చెప్పారు!"

"వేరే రోజుల్లో తీరిస్తే ఏం జరుగుతుందట?"—

"హఠాన్మరణం సంభవిస్తుందట!"

ఉలిక్కిపడ్డారు బామ్మగారు.

"ఎవరికీ?" ఆత్రంగా అడిగారు.

"నాకే నండోయ్! అలా నేను హఠాన్మరణం పొందితే మీకు మంచిదా చెప్పండి?..."

అప్పారావు ధోరణి అర్థంచేసుకున్నారు బామ్మగారు. తన అప్పు ఎగ్గొట్టటానికే అలాంటి ట్రిక్కు ప్లేచేస్తున్నాడని గ్రహించారు...కొన్ని క్షణాలు ఆలోచించారు...

"పోనీ...నీ అప్పు వదిలేసుకుంటాను గానీ నాకో సహాయం చేస్తావా?"-అని అడిగారు.

ఆవిడగారి ప్రశ్న వినగానే- ఎగిరి గంతెయ్యాలనిపించింది అప్పారావుకి.

"చెప్పండి...ఏం చేయమంటారు?" ఉత్సాహంగా అడిగాడు...అయితే బామ్మగారు వెంటనే చెప్పేయలేదు. చిన్న కండిషన్ పెట్టారు.

"చెప్తాను గానీ- తప్పకుండా చేస్తానని ప్రమాణం చెయ్యాలి!...ఒకవేళ మాట తప్పితే- నా డబ్బు నాకు వెంటనే ఇచ్చేయాలి!"

ఆ మాటలకు సందిగ్ధంలో పడ్డాడు అప్పారావు...ఒకవేళ ఆవిడగారు తాను చేయలేని పని చెప్తే...

"నాకు సాధ్యమైతే మీకోసం తప్పకుండా చేస్తాను బామ్మగారూ!"- అన్నాడు ధైర్యంగా.

"మాఇంటి పెరటిగోడ తెలుసుగా?" —అడిగారు బామ్మగారు. తెలుసునన్నట్టు తలూపాడు అప్పారావు.

"రేపు రాత్రి సరిగ్గా 12 గంటలకు— మా గోడ దూకి పెరట్లోకి దిగాలి..."

"ఓస్...ఇంతే కదా! నాకు గోడలు దూకటం చిన్నప్పుడు అలవాటే బామ్మగారూ....కాలేజీ రోజుల్లో - నేను హై

జంపులో వస్తు!"- చెప్పాడు కాలరు సవరించుకుంటూ. ఆ తర్వాత మరు క్షణా నికే మళ్ళీ అనుమానం వచ్చి అడిగాడు-

"ఇంతకీ- అర్థరాత్రిపూటా — మీ పెరటిగోడ దూకి లోపలకు రావటం ఎందుకో చెప్పలేదు!"

"మరేంలేదు...ఈ మధ్య మా వూరి నించి రాణీని తీసుకొచ్చాను కదా..."-

అర్థంకాలేదు అప్పారావ్‌కి.

"ఓహో! మా రాణీ గురించి నీకు చెప్పలేదు కదూ...చాలా అందంగా వుంటుందిలే! దాని కళ్ళు ఎంత బావుంటాయనుకున్నావ్!..చిన్నప్పుడు కొంచెం బిక్కగా వుండేది కానీ— ఈ మధ్య కాస్త వయసొచ్చింది కదా - కొంచెం ఒళ్ళు చేసిందిలే! రాత్రిళ్ళు- భోజనం కాగానే హాయిగా పెరట్లోకి వెళ్ళి - అక్కడ మామిడిచెట్టు కింద-మడత మంచంమీద పడుకుంటోంది!"—

బామ్మగారలా చెప్తోంటే - అప్పారావుకి ఏదో డౌటు వచ్చేసింది. గాభరా పడిపోతూ అన్నాడు-

"చూడండి బామ్మగారూ! మీ రాణీ అందంగా వుండే అనుకోండి...పెరట్లో పడుకుండే అనుకోండి...అంతమాత్రాన నేను గోడదూకటం ఎందుకో- దూకినా ఏం చేయాలో ఏమిటో అర్థంకావటం లేదు!"—

"మరేంలేదు నాయనా! నువ్ గోడ దూకి, పెరట్లోకి దిగితే-మా రాణీ నిన్ను కరుస్తుందో లేదో చూద్దామనీ!"—ముసి ముసిగా నవ్వుతూ చెప్పారు బామ్మగారు.

అదిరిపడ్డాడు అప్పారావు.

"అంటే...కొంపదీసి రాణీ అంటే కుక్క- కాదు కదా?"- అన్నాడు భయం భయంగా.

"ఛ! దాన్ని అంత మాటనకు. మా యింట్లో, దాన్ని కూడా ఓ మెంబరులాగ చూసుకుంటాం. రోజూ పదిరూపాయల మటను తింటుంది! రెండు లీటర్ల పాలు తాగుతుంది. ఉత్త్రంగా తినేసి, తాగేసి, పెరట్లో పడుకుని నిద్రపోవటమేనా? లేక దొంగోడొస్తే కరుస్తుందా—చూద్దామనీ" తీరుబడిగా చెప్పారావిడ.

"కరిస్తే నేను చచ్చిపోతానండీ బాబూ!"

"చాల్చాల్లే. మరీ అంత చోద్యంగా మాట్లాడకు! కుక్క- కరిస్తే- ఎవరైనా 'వెంటనే' చచ్చిపోతారా?"

"వెంటనే కాకపోతే ఆర్నెల్లకో, ఏడాదికో పిచ్చెక్కి- మరీ చస్తారు ఏమిటనుకుంటున్నారో!"- కోపం వచ్చేసింది అప్పారావుకి.

"ఆ సంగతి నాకూ తెలుసు! కానీ నువ్వలాంటి భయాలేం పెట్టుకోకు... బొడ్డు చుట్టూ పదకొండు ఇంజక్షన్లు ఇస్తారు మా వ్యాఘ్రేశ్వరరావుగారు!"

"వ్యాఘ్రేశ్వరరావుగారా? ఆయనెవరండీ!"

"మా వీధిలోనే వుంటాడులే!...పశువుల డాక్టరు. నిన్ను మా రాణీ కరిచిన



ఇరవై నాలుగు గంటల్లో ఆయన దగ్గరకు తీసికెడితే చాలు. రోజు విడిచి రోజు చొప్పున పదకొండు ఇంజక్షన్లు ఇస్తాడు. మొత్తం ఫీజు రెండువందలు పుచ్చుకుంటాడు...నువ్వెలాగా నాకు రెండువందలివ్వాలిగా! అది ఇచ్చేశా వనుకువి-విమ్మ మా రాణీ కరిస్తే- ఆయనగారికి ఆ ఫీజు నే నిచ్చేస్తాను!"

ఆవిడ అతితెలివికి అవాక్కయి-గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు అప్పారావు.

"మాట తప్పనని ప్రమాణం కూడా చేశావ్!...ఒప్పుకో నాయనా! ఈ ముసల్దానికోసం ఆ మాత్రం తెగించలేవా?... నువ్ ఇవ్వాల్సిన రెండువందలూ ఇంక ఇవ్వక్కర్లేదని చెప్పానుగా!"- బుజ్జగిస్తున్న ధోరణిలో మళ్ళీ అన్నారు బామ్మగారు.

ఆ క్షణం ఆలోచించిన అప్పారావ్ —సీరియస్‌గా అన్నాడు-

"చూడండి బామ్మగారూ! మీకు ఇలాంటి సహాయం చేయటంకంటే- వేరే ఎవరిదగ్గరైనా ఓ రెండువందలు అప్పు తీసుకోవటమే యీజీ నాకు! మీ రిక్కడే వుండండి...నే నిప్పుడే అలా ఊళ్ళోకి వెళ్ళి-డబ్బు తీసుకొస్తాను!..." అంటూ వీధిలోకి పరుగెత్తాడు.

తమ పాచిక పారినందుకు బామ్మగారు తమలో తామే ముసిముసిగా నవ్వుకున్నారు. * *

(ఒక జోక్ ఆధారంగా)